వందలో ఇబ్బందులు

- పాలనపై ప్రచార ఆర్భాట కార్యక్రమాలు
- ప్రజా సమస్యలన్నీ గాలికి..
- రోడ్లపై గుంతలు కూడా పూడ్చని వైనం
- కొద్దిపాటి వర్షానికే మడుగులవుతున్న రోడ్లు

కాకినాడ రూరల్: ఇది మంచి ప్రభుత్వమంటూ గడిచిన వంద రోజుల పరిపాలనపై ప్రజల్లోకి వెళుతున్న కూటమి పార్టీల నాయకులకు ప్రజల నుంచి ఆశించిన మేరకు స్పందన కానరావడం లేదు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగామని గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ప్రజలు మూకుమ్మడిగా ముఖం చాటేస్తున్నారు. సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల ముందు హామీలిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక.. కూటమి ప్రభుత్వం పింఛన్లను, ఉద్యోగుల జీతాలను సకాలంలో ఇస్తున్నామని, మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపడుతున్నట్టు 'ప్రచారం' చేసుకుంటున్నారు. ఉచిత బస్సు, మహాలక్ష్మి, తల్లికి వందనం వంటి పథకాల కోసం మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. హామీల మాట పక్కన పెడితే.. గత ప్రభుత్వం రోడ్లు వేయలేదంటూ ప్రచారం చేసిన కూటమి నేతలు, వంద రోజుల పాలనలో ఏం చేశారో ప్రజలకు బాధ్యతగా తెలియజేయాల్సి ఉంది. గోతులు కాస్తా రెట్టింపైనా, రోడ్లు వేయడం అటుంచితే.. కనీసం వాటిని పూడ్చే పని కూడా చేపట్టడం లేదు. దీంతో ప్రజలు 'మా కర్మ ఇంతే' అంటూ ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధిలో తమకు తామే సాటి అని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసింది. గల్లా పెట్టె ఖాళీగా ఉందంటూ 'బూచీ'ని చూపెడుతూ, ఆ పార్టీ నాయకులు సమావేశాల్లో లేనిపోనివీ ఊదరగొడుతూ తప్పించుకుంటున్నారు.

రోడ్లు జలమయం

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల డ్రైనేజీలు సక్రమంగా లేవు. దీంతో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే నాగమల్లితోట జంక్షన్ వద్ద సోమవారం కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచిపోయింది. నీరు పోయేందుకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో, నీరు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు మార్గంలో పెద్ద గొయ్యి ఏర్పడినా కూటమి నేతలు పట్టించుకోవడం లేదు. వలసపాకల గ్రామ పరిధిలోని గంగరాజునగర్ రోడ్డు నంబరు-4లో సంతోష్‌నగర్ వద్ద కొద్దిపాటి చినుకులకే సిమెంట్ రోడ్డు జలమయంగా మారుతోంది. వర్షపు నీరు డ్రైనేజీల్లోకి పోయేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. పంచాయతీ, మండల స్థాయి అధికారుల్లో చలనం లేదు.

నరక యాతన

కాకినాడ సిటీ పరిధిలోని దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రేవుకు వెళ్లే మార్గంలో రుచి ఆయిల్స్ ఫ్యాక్టరీ, గోడౌన్ వద్ద రోడ్డు దాదాపు పూర్తిగా దెబ్బతింది. భారీ గుంతలు పూడ్చలేని స్థాయిలో గోతులుగా మారాయి. ఈ మార్గంలో కుంభాభిషేకం వద్దకు వెళ్లే మత్స్యకారులు, చేపల కొనుగోలుకు వెళ్లే నగర ప్రజలు, పోర్టు, మెరైన్ స్టేషన్, కోస్టుగార్డు స్టేషన్లకు వెళ్లే సిబ్బంది నరక యాతన అనుభవిస్తున్నారు. నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కనీసం గోతులు పూడ్చే కార్యక్రమం కూడా చేయడం లేదు. నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్పందించి, తక్షణం గోతులు పూడ్చించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం మార్గంలో ఏర్పడిన భారీ గోతులు


నాగమల్లితోట జంక్షన్ వద్ద సోమవారం కురిసిన వర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు


డ్రైనేజి సక్రమంగా లేక వలసపాకల గంగరాజు నగర్‌లో జలమయమైన సిమెంట్ రోడ్డు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ పూర్ణచంద్రరావు

బాలాజీచెరువు: జిల్లా స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జిల్లా అథ్లెటిక్స్ ఎంపికల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగంలో ప్రగతి విద్యాసంస్థలకు చెందిన ఎ.జాహ్నవి రిషిత, వి.జోత్స్న, జావెలిన్ త్రోలో బి.హేమశ్రీ చౌదరి, బి.శృతి ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అక్టోబర్ మూడు నుంచి రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. యోగా పోటీల్లో జిల్లా స్థాయిలో అదే విద్యాసంస్థకు చెందిన వి.భబిత, జీ.హేమశ్రీ, జి.అశ్విని, ఎస్ ఎస్‌వీవీఎస్ ఈశ్వర్, టి.జస్వంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, డైరెక్టర్లు అభినందించారు.

గ్రేడ్-2 ఏపీపీగా రత్నంబాబు



కాకినాడ లీగల్: కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా జి.వెంకట రత్నం బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు రాజమహేంద్రవరం ఒకటో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు గ్రేడ్-2 ఏపీపీగా విధులు నిర్వహించారు.

సీపోర్టు భారీ చేయూత


బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు పరికరం అందజేస్తున్న ప్రతినిధులు

బాలాజీచెరువు: నామమాత్రపు రుసుముతో పేద, మధ్య తరగతి వర్గాల వారికి వైద్య పరీక్షల సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు కాకినాడ సీపోర్టు సంస్థ చేయూతనిచ్చింది. పోర్టు డైరెక్టర్ కేవీ రావు సహకారంతో రూ.ఐదు లక్షల విలువైన ఫుల్ ఆటోమెటెడ్ బయోకెమిస్ట్రీ అనాలసిస్ పరికరాన్ని సోమవారం పోర్టు సీఈఈ మురళీధర్ అందజేశారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పేదలకు సేవలు అందిస్తున్న ఇటువంటి సంస్థలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, చుంద్రు గోవిందరాజు, జీఎం మూర్తి, మంజులూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

భారీగా అన్నదానాలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా కాకినాడ నగరంలో 4 లక్షల 36 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారని నగర గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. సోమవారం నగరంలోని దంటువారివీధి, పెద్ద మార్కెట్, గాంధీనగర్ రైతు బజార్, జగన్నాథపురం, రామారావుపేటతో పాటు, పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున అన్నదానాలు నిర్వహించారు. వీరికి సమితి తరఫున అభినందన పత్రాలు అందించారు.

దాడి ఘటన విచారకరం

కాకినాడ రూరల్: కాకినాడలో దళిత వైద్యుడిపై దాడి ఘటన దురదృష్టకరమని, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవేశంతో తన సహనాన్ని కోల్పోవడం విచారకరమని జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ అన్నారు. రంగరాయ వైద్య కళాశాల ప్లే గ్రౌండ్‌లో ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీపై ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనపై సోమవారం ఆయన మీడియాతో స్పందించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు మాటతీరును ఎప్పుడూ గమనిస్తారని, ఎమ్మెల్యే స్థాయిలో ఉండి, అధికారిని పిలిచి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఆయనే నేరుగా ఆవేశంతో మాట్లాడడం సరికాదన్నారు. ప్రాయశ్చితం చేసుకోవడం మంచిదేనని, దీనివలన దళిత సామాజిక వర్గానికి కొంతైనా ఉపశమనం కలుగుతుందన్నారు.

వీడియో కాన్ఫరెన్స్

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షణ్మోహన్ జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక రూపకల్పనపై కలెక్టర్‌తో చర్చించారు. జెడ్పీ సీఈవో నారాయణ మూర్తి, సీపీవో త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో భావనారాయణ స్వామి ఆలయం సమీపంలో అదే గ్రామానికి చెందిన మెకానిక్ దేవబత్తుల కిరణ్ బాబు(31) మృతదేహం సోమవారం లభ్యమైంది. అతడు అదృశ్యమైనట్టు నాలుగు రోజుల క్రితం సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభం

ప్రారంభించిన కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పింక్ ఎన్‌జీవో, గైనకాలజీ, ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎంటీ భవంతిలోని గైనిక్ బ్లాక్‌లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసన్ ఆధ్వర్యంలో గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి ఈ స్క్రీనింగ్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ పద్మదీపిక, డాక్టర్ విజయ, డాక్టర్ సూర్యకుమారి, డాక్టర్ రుక్మిణీ బృంద సారథ్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. అమెరికాకు చెందిన పింక్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రఖ్యాత రోబోటిక్ సర్జన్, యూరో గైనకాలజిస్టు డాక్టర్ సమత కడియాల పర్యవేక్షణలో ఏడుగురు వైద్యుల బృందం జీజీహెచ్ వైద్యులతో కలిసి ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. తొలి దశ క్యాన్సర్‌ను గుర్తించిన వారికి ప్రత్యేక యంత్రం ద్వారా తక్షణం వారిలో కేన్సర్‌ను తొలగిస్తున్నారు. మొదటి రోజు 92 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 10 మందిలో తొలి దశ సర్వైకల్ క్యాన్సర్ బాధితులను గుర్తించారు. వారికి తక్షణ వైద్య సేవలు అందించి నిమిషాల్లోనే క్యాన్సర్‌ను తొలగించారు. మహిళలను చైతన్య పరిచి అధిక సంఖ్యలో ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకునేలా జీజీహెచ్ యాజమాన్యం శ్రమించిందని జేఎన్‌టీయూకే ఫార్మసీ అధికారి భవాని తెలిపారు. ఐద్వా సహా, వివిధ ప్రభుత్వ శాఖల మహిళా విభాగాలు ఆ దిశగా చైతన్యం అయ్యాయన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న వివాహితలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ ప్రదీప్, నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.


స్క్రీనింగ్ పరీక్షల సేవలు ప్రారంభిస్తున్న కలెక్టర్, పింక్ సంస్థ ప్రతినిధులు

సకాలంలో సమస్యల పరిష్కారం

కార్పొరేషన్ కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ భావన నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి పలువురు ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భావన అక్కడున్న అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ భావన వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 11 మంది వివిధ సమస్యలపై ఫోన్లు చేశారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలోను పలువురు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. వాటిలో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యూపీఏ, రెవెన్యూ విభాగానికి సంబంధించిన వినతులు ప్రజల నుంచి అందాయి. వాటిని స్వయంగా తీసుకుని. వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. పరిష్కారమైన సమస్యలకు సంబంధించి సంబంధిత దరఖాస్తుదారునికి సమాచారం కూడా ఇవ్వాలన్నారు. ఆయా దరఖాస్తుల ప్రగతిపై ప్రతివారం సమీక్షిస్తామని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బోట్‌క్లబ్: తిరుమల లడ్డూ అపవిత్రమైతే, అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ అన్నారు. స్థానిక గాంధీనగర్ ఓలేటివారివీధిలో సోమవారం పరిషత్ సమావేశం జరిగింది. తిరుమలలో లడ్డూపై జరుగుతున్న ప్రచారం హిందువులను మనోవేదనకు గురిచేస్తోందన్నారు. అన్యమతస్తులను తిరుమల తిరుపతి దేవస్థానంలో నియమించడం వల్ల ఇటువంటి అపచారాలు జరుగుతున్నాయన్నారు. కేవలం హిందువులను మాత్రమే తిరుమలలో నియమించాలన్నారు. లడ్డూ విషయంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, సంబంధిత వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో పరిషత్ సభ్యులు గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ, బిక్కిన రాజు, జి ఉదయ భానోజీరావు పాల్గొన్నారు.

భవిత సెంటర్ ఆకస్మిక తనిఖీ

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలోని భవిత సెంటరును జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సెంటరులోని టీఎల్ఎం, సీఎల్ రిజిస్టర్లు, ప్రశస్థ యాప్ రిజిస్ట్రేషన్, యూడీఐడీ కార్డు రిజిస్ట్రేషన్ తదితర రికార్డులను పరిశీలించి, అప్‌డేట్‌గా ఉన్నాయో, లేదో తనిఖీ చేశారు. ఐఈఆర్‌టీ వైవీ లక్ష్మి, సీహెచ్ వీరగణేష్‌కు పలు సూచనలు ఇచ్చారు.

రైఫిల్ షూటింగ్‌లో లక్ష్మీలేఖ్యకు గోల్డ్ మెడల్

బాలాజీచెరువు (కాకినాడ): సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్‌లో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి నల్లమిల్లి లక్ష్మీలేఖ్య బంగారు పతకం సాధించింది. సీబీఎస్ఈ సౌత్‌జోన్ అండర్-17 పోటీల్లో బాలికల విభాగంలో ప్రతిభ చూపి పతకం సాధించినట్టు పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి తెలిపారు. పోటీలు ఈ నెల 19 నుంచి 22 వరకూ తమిళనాడులోని టెంకాసీలో నిర్వహించగా, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు.

ఐడియల్ అధ్యాపకురాలికి బెస్ట్ టీచర్ అవార్డు

బాలాజీచెరువు: ఐడియల్ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకురాలు ఏసీహెచ్ స్రవంతికి బెస్ట్ టీచర్ అవార్డు దక్కింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నీత్ అయోగ్‌కు అనుబంధంగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కాంపిటెన్సివ్ కౌన్సిల్ బెస్ట్ టీచర్ ఆఫ్ ది ఇయర్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు స్రవంతిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ తలాటం సత్యనారాయణ, అధ్యాపకులు సోమవారం అభినందించారు.


స్రవంతిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి

కక్ష సాధింపు..

- ఆలయ ప్రాంగణంలో దుకాణాల కూల్చివేత
- టీడీపీ నేతల చర్యలపై విమర్శలు

కాకినాడ: టీడీపీ నేతల కక్ష సాధింపు చర్యలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ మద్దతుదారులే లక్ష్యంగా చేస్తున్న వేధింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా కాకినాడ సంతచెరువు కనకదుర్గ ఆలయం ప్రాంగణంలోని కొన్ని దుకాణాలను తొలగించి, అధికార పార్టీ కక్ష సాధింపులకు మరోసారి ప్రోత్సహించింది. గత ప్రభుత్వ హయాంలో దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో నిర్మించిన దుకాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఆలయ నిర్వహణ కష్టతరంగా మారిన నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సంతచెరువు వద్ద ఉన్న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో దుకాణాలను నిర్మించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ నిర్వహణ సాగించాలన్న నిర్వాహకుల లక్ష్యానికి తూట్లు పొడిచారు. అక్కడ నిర్మించిన మూడు దుకాణాలు, ఈవో కార్యాలయం, టాయ్‌లెట్ బ్లాక్, పంపు హౌస్‌లను నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం తొలగించింది. అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే ఈ చర్యలకు పాల్పడ్డారు. రహదారి ఆక్రమణ, డ్రైనేజీ నిర్మాణానికి అవరోధంగా ఉన్నాయనే సాకుతో దుకాణాలు తొలగించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. పనిలో పనిగా సంత చెరువు సమీపంలోని జ్యోతుల మార్కెట్‌లో దుకాణాల వద్ద షెడ్లను టౌన్ ప్లానింగ్ విభాగం తొలగించింది.


పొక్లెయిన్‌తో దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

పెరిగిన ధరలపై కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా

కాకినాడ సిటీ: ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర సరకులు ధరలు తగ్గించి, అదుపులో ఉంచాలని సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలకల వెంకటరమణ మాట్లాడుతూ, ఉపాధి సక్రమంగా దొరక్క, సరైన ఆదాయం లేక సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ విధమైన కూరగాయలు కొందామన్నా కిలో రూ.100 వరకు ఉందన్నారు. బియ్యం, పప్పులు, నూనె తదితర నిత్యావసరాల ధరలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సామాన్యులు ఏ విధంగా పౌష్టికాహారం తినగలరని ప్రశ్నించారు. పంటలు దెబ్బతినడం వల్ల ధరలు పెరిగాయనే వాదన సరికాదన్నారు. సరఫరా యథావిధిగా ఉన్నప్పుడు ధరలు పెరగకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరకులు అందించాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత యంత్రాంగం ద్వారా జోక్యం చేసుకుని కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలు తగ్గించి, అదుపులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యురాలు కె నాగజ్యోతి, ట్రేడ్ యూనియన్ నాయకులు సీహెచ్ రాజ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, టి రాజా పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ కాకినాడ రూరల్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రూరల్ కన్వీనర్ తొట్టిపూడి రాజా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాకినాడ రూరల్‌లో ఉన్న పరిశ్రమల్లో స్థానికులు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పరిశ్రమలు నెలకొల్పే సమయంలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు ఇస్తామని హామీలిచ్చి, పరిశ్రమల నిర్మాణం పూర్తయిన తర్వాత ఉద్యోగాలు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. రూరల్ ప్రాంతంలో ఉన్న భూమి, విద్యుత్, మంచినీరు, ఇతర సౌకర్యాలను, సబ్సిడీలు పొందుతున్న యాజమాన్యాలు.. స్థానికులకు ఉపాధి కల్పించకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకుని, పని చేయించుకుంటున్నారన్నారు. పరిశ్రమల కేంద్రంగా ఉన్న వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, సూర్యారావుపేట, లైట్‌హౌస్, తమ్మవరం గ్రామాల్లో ఉన్న కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కాకినాడ రూరల్ మండలంలో పోర్టు, ఏఎంగ్రీన్ అమోనియా, కోరమండల్. ఓఎన్‌జీసీ, ప్యారీ షుగర్స్, ఆదాని, సంతోషిమాత, కాళేశ్వరి, జెమినీ, వీఎంసీ, ఎన్‌సీఎస్, మహంతి ఆయిల్ పరిశ్రమల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. వీటిల్లో స్థానికులకు ఉపాధి కల్పించకుండా బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వలస కార్మికులను తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నారన్నారు. ఆయా పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి చంద్రరావు, డి సత్యనారాయణ, వాసంశెట్టి సత్తిబాబు, సురేష్, నూకరాజు, రామకృష్ణ, నాగబాబు, నరసింహస్వామి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.


స్థానికులకు ఉపాధి కోసం ధర్నా చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

కలెక్టర్‌తో జేఏసీ నేతల భేటీ

కాకినాడ సిటీ: సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ షణ్మోహన్ ఛాంబర్‌లో ఉద్యోగ జేఏసీ, ఉద్యమ జేఏసీ నేతలతో భేటీ జరిగింది. కలెక్టర్‌తో పలు అంశాలు చర్చించారు. నేతలు బూరిగ ఆశీర్వాదం, గుద్దటి రామ్మోహనరావు, పసువులేటి శ్రీనివాస్ తదితరులు ఉద్యోగ సమస్యలపై మాట్లాడారు. పలువురు దళిత నేతలు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఆర్ఎంసీ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడి విషయం ప్రస్తావించారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్, జేఏసీ నేతలు ఈ దాడిని ఖండించారు.

కార్పొరేషన్‌లో బదిలీల పర్వం

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పలువురు సీనియర్ అధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న అధికారులను వేర్వేరు ప్రాంతాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హిందూపురం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడకు కార్యదర్శిగా వస్తున్నారు. అలాగే నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి విజయవాడ కార్పొరేషన్ ఎస్ఈగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు టిడ్కో ఈఈగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న మాధవి రాజమహేంద్రవరం ఈఈగా బదిలీ అయ్యారు.

ఆ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



బ్లాక్ డే కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక నాయకులు

బ్లాక్ డే ఆందోళనలో కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కాకినాడ హెడ్ పోస్టాఫీసు వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే ఆందోళనను సోమవారం నిర్వహించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను పార్లమెంటులో 2020 సెప్టెంబర్ 22న ప్రవేశపెట్టిన చీకటి రోజు సందర్భంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించు కోవాలని, పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల నాయకులు దువ్వా శేషబాబ్జీ, తోకల ప్రసాద్, జల్లూరి వెంకటేశ్వర్లు, తాళ్లూరి రాజు మాట్లాడారు. కార్మిక వర్గ ఒక్క డిమాండుని మోదీ ప్రభుత్వం పదేళ్లలో పరిష్కరించలేదని విమర్శించారు. ఉన్న హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. మోదీ విధానాల వల్ల నిత్యావసర ధరలు అమాంతం పెరుగుతుంటే, కార్మికుల వేతనాల కుదింపు, ఉద్యోగాల తొలగింపు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల మూసివేతలతో నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా పెరగడానికి మోదీ కార్పొరేట్ విధానాలే కారణమన్నారు. పారిశ్రామిక ప్రమాదాలతో వేలాది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రూపాయి విలువ గణనీయంగా దిగజారి, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిందన్నారు. నిత్యం దేశంలో 80 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత విద్యుత్‌కి మంగళం పాడి, విద్యుత్ చార్జీలను పెంచడానికి కూటమి ప్రభుత్వం యోచిస్తోందన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు విమర్శించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెడ్పీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా విద్యారంగ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో పీజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు పూర్తిస్థాయిలో భవనాలు సమకూర్చాలన్నారు. మెస్ చార్జీలు విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే జీవో నంబర్ 35, 36, 42ను రద్దు చేయాలన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే చర్యలను తక్షణం ఆపాలన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు శ్రీకాంత్, జి.చిన్ని, జైరామ్, వెంకటేష్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్	: చాక్లెట్ 35, సరిపోదా శనివారం, హైడ్ ఎన్ సీక్, మత్తు వదలరా 2
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్	: గొర్రె పురాణం, 35, సరిపోదా శనివారం, 100 కోట్లు
లక్ష్మీ	: ట్రాన్స్‌ఫార్మర్స్
సత్యగౌరి	: గొర్రె పురాణం
తిరుమల	: చాక్లెట్
సీఅండ్‌సీ1	: మత్తు వదలరా 2
సీఅండ్‌సీ2	: బొమ్మరిల్లు
శ్రీప్రియ	: ఆయ్
పద్మప్రియ	: సరిపోదా శనివారం
సూర్య (వాకలపూడి)	: గొర్రె పురాణం
సూర్య2	: సరిపోదా శనివారం